క్లుప్తంగా

ప్రపంచ మానవ హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్ధు



సిద్ధుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న డా. లయన్ శంకర్

కూకట్‌పల్లి: ప్రపంచ మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నవోదయ సిద్ధును నియమితులయ్యారు. ముంబైలోని ప్రపంచ మానవ హక్కుల సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ లయన్ శంకర్ చేతుల మీదుగా సిద్ధు నియామ కపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలోని ప్రతి ఒక్కరికి మానవ హక్కులు ఉంటాయన్నారు. వాటిని కాపాడుకొని నైతిక విలువలు పాటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిలీపు, ప్రధాన కార్యదర్శి సతీష్, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ కుమార్, హైద రాబాద్ సిటీ ఉపాధ్యక్షుడు యేసు, రూరల్ ఉపాధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ నిజాంపేట్ రోడ్డులోని సంఘమిత్ర స్కూల్ వద్ద చేపట్టిన సీసీరోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపా ధ్యక్షుడు పోతుల రాజేందర్, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

27న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 కేంద్రాల్లో 3 శిబి రాలను ఉదయం 9:30 గంటల నుంచి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి రామచంద్రాపురం తహ సీల్దార్ కార్యాలయం, లేబర్ ఆఫీసు కార్యా లయాల్లో.. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి సంగారెడ్డి శాంతినగర్‌లోని విద్యుత్ కార్యా లయం, మెదక్ జిల్లాకు సంబంధించి కలెక్టరేట్ కార్యాలయంలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమ స్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేం ద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకో వాలని సూచించారు.

'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు

హఫీజ్‌పేట్: 'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని శేరి లింగంపల్లి నియోజకవర్గం పీసీసీ ప్రతినిధి సత్యంరావు పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి, త్వరలో మొదలు కాబోతున్న 'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని పార్టీ నాయకత్వానికి దిశా నిర్దేశం చేశారు.

ఒత్తిడిని అధిగమించడానికి 'జియో జీ భర్ కే' కోర్స్

నిజాంపేట్: సుఖమయ జీవితానికి 'జియో జీ భర్ కే' ఉపయోగ పడుతుందని కోచ్ రాజశేఖర్ అన్నారు. సోమవారం ప్రగతినగర్‌లోని సుంద రయ్య భవన్‌లో 22 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా, అన్ని విషయాలను ఆస్వాదిస్తూ, హుందాగా, ఆనం దంగా జీవితాన్ని కొనసాగించడం కోసం రూపొందించిన ఆచరణాత్మక కోచింగ్ 'జియో జీ భర్ కే'కు సంబంధించి డెమో ఇచ్చారు. ఒత్తిడి, విరక్తి, భయం, భ్రమ, అహంకారం, అపోహలు, అసూయ, కలతలు, గతం, అలస త్వం, నిరాశలను అధిగమించడానికి ఈ కోర్స్ దోహద పడుతుందన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్: హెచ్‌ఏఎల్ క్వార్టర్స్‌లో మయాంక్ రావత్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. మయాంక్ రావత్ ఉద్యోగం చేస్తూనే హోటల్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. దాంట్లో నష్టపోయిన అతను బాధపడుతూ ఉండేవాడు. 25వ తేదీన ఉదయం ఇంట్లోనే తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసు కొని చనిపోయాడు. ఉదయం చూసిన భార్య చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దించి చూడగా అప్పటికే చనిపోయాడు. భార్య నీలం రావత్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల బంధు

- నియోజకవర్గానికి 1,100 మందికి దళిత బంధు
- రెండో విడత అమలుకు అధికార యంత్రాంగం సన్నాహాలు
- ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- మొదటి విడతలో నియోజకర్గానికి 100 మందికి మాత్రమే లబ్ధి
- లబ్ధిదారుల ఎంపికలోనూ ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- సమగ్ర సర్వే ఆధారంగా మండలాలు, డివిజన్లు వార్డుల వారీగా ఎస్సీల జాబితా వివరాల సేకరణపై కసరత్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: దళిత కుటుంబాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అమలుకు గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని సం బంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేసిన తెలంగాణ సర్కారు.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక్కో నియోజకవర్గంలో 1,100 చొప్పున గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల పరిధిలోని 27 అసెంబ్లీ నియోజకవర్గాలలో 29,700 మంది దళిత కుటుంబాలకు వర్తింపజేసేందుకు దళిత బంధు పథకాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ సహా శివారు జిల్లాల సంబంధిత అధికారులు కూడా దళిత బంధు పథకాన్ని పకడ్బం దీగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండలాల వారీగా సేకరణ

లబ్ధిదారుల ఎంపికకు జిల్లాల వారిగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రూరల్‌లో మండలాలు, పురపాలక సంఘాల్లో డివి జన్లు/వార్డుల వారీగా ఎస్సీ జనాభా, కుటుంబాల సంఖ్య తదితర వివరాలు సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా సేకరిస్తున్నారు. రెండు రోజుల కిందట ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కలెక్ట ర్లకు లబ్ధిదారుల ఎంపికకు అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలు చేశారు. రెండో విడత దళిత బంధు పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది.

విధి విధానాలపై కసరత్తు

ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేసి, వారి ఉన్నతికి తోడ్పడ టమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మొదటి విడతలో లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించగా ఇన్‌చార్జి మంత్రి ఆమోదించారు. దీంతో ఎంపిక పూర్తిగా ఏక పక్షంగా చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం రెం డో విడత ఎంపికకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అక్రమాలు అరికడితేనే ప్రయోజనం

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో మొదటి విడత దళిత బంధులో ఎంపికై న లబ్ధిదారుల్లో కొందరు యూనిట్లు విక్రయించుకున్నారనే ఆరోపణలు న్నాయి. మరికొందరు యూనిట్లు స్థాపించుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతు న్నారు. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దళారులుగా వ్యవహరించి లబ్ధిదారుల నుంచి యూనిట్లను కాజేసినట్లు విమర్శలు ఉన్నాయి. మెజారిటీ లబ్ధిదారులు వాహనాల కొనుగోలుకే మొగ్గుచూపారు. దీంతో ఉపాధి కొరవడి వాటిని నిర్వహించే ఆర్థిక స్తోమత లేక తక్కువ ధరకే విక్రయించుకుంటున్నట్లు తెలుస్తోంది. రెండో విడత దళిత బంధులో గతంలో జరిగిన తప్పిదాలు పునరా వృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికార యంత్రాంగం భావిస్తున్నట్లు తెలు స్తోంది. దళారుల బెడద లేకుండా నేరుగా లబ్ధిదా రుల సమక్షంలోనే యూనిట్ల ఎంపికపై అవగాహన కల్పించాల్సింది. ఉపాధి కల్పనపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే దిశగా సంబంధిత అధికా రులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మొదటి విడతలో 2,700 మందికే..

మొదటి విడత దళిత బంధు పథకంలో భాగంగా గ్రేటర్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 100 చొప్పున 27 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,700 మందికి దళిత బంధు పథకాన్ని వర్తింపజేశారు.

ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం

- కలెక్టరేట్ ముట్టడిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్.మూర్తి
- పాఠ్యపుస్తకాలు, టీచర్లు లేకుండా పాఠాలు ఎలా చదవాలి..?
- ప్రైవేటులో ఫీజులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నా పట్టదా..?
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించడ లో పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్య క్షుడు కేఎల్.మూర్తి తీవ్రంగా ధ్వజమెత్తారు. సకాలం లో సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని గొప్పలు చెప్పినా, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా యూనిఫామ్ రాలేదన్నారు. తెలంగాణ విద్యా దినోత్సవానికి విద్యార్థులు పాఠశాలలకు పాత బట్ట లతోనే హాజరయ్యారని ఎద్దేవా చేశారు.

◆ అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎ ల్.మూర్తి మాట్లాడుతూ ఇంటర్మీడియట్, గురుకుల, సంక్షేమ హాస్టళ్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కాలేదని, పేద విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నిం చారు. రాష్ట్రంలో 24 వేల టీచర్, 12 వేల లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఒక మేడ్చల్ జిల్లాలో 15 మండలాలు ఉంటే.. ముగ్గురు విద్యా ధికారులు మాత్రమే పని చేయటం సిగ్గుచేటన్నారు.

◆ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంజినీరిం గ్, మెడికల్ సీట్ల ఫీజులకు నియంత్రణ లేదని, వెం టనే నియంత్రణ చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్, జిల్లా అధ్యక్షుడు బి.వెం కటేష్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రైవేట్, కార్పొ రేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీ ఎస్ఈ పేరుతో రూ.లక్షల వ్యాపారం చేస్తున్నా.. ప్రభుత్వం చోద్యం చూస్తోందని పేర్కొన్నారు.

◆ కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వ హించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను అరెస్టు చేసి శామీర్‌పేట పీఎస్‌కు తరలించారు. ఎస్ ఎఫ్ఐ జిల్లా నాయకులు కిరణ్, అరుణ్, ప్రసాద్, శ్రీను, శ్రీశైలం, నరసింహ, పవన్ పాల్గొన్నారు.

'ప్రత్యేక రాష్ట్రంలో పేదలకు మిగిలింది నిరాశే'

నిజాంపేట్: ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మాత్రం మారడం లేదని.. ప్రత్యేక రాష్ట్రంలో తమ బతుకుల మారతాయని ఆశలు పెట్టుకున్న ప్రజానీకానికి నిరాశే మిగిలిందని ప్రజా సంఘాల జిల్లా నాయకుడు బాలపీర్, సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలన్న ప్రజా సంఘాల పిలుపు మేరకు సోమవారం బాచుపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో టైపిస్ట్ మహేందర్‌కు వినతి పత్రం అందజేశారు.

◆ అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం అవతరించి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుం టున్నా పేదలకు గూడు కరువైందన్నారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లోని 61 కేంద్రాల్లో లక్షలాది మంది గుడి సెలు వేసుకుని నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. పోలీసులతో అరెస్టులు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మద్దుతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

భారత జాగృతి యూకే యువజన విభాగ ఇన్‌చార్జ్‌గా ప్రశాంత్



నియామక పత్రం అందుకుంటున్న ప్రశాంత్

కూకట్‌పల్లి: భారత జాగృతి యూకే యువజన విభా గానికి ఇన్‌చార్జ్‌గా కూకట్‌పల్లికి చెందిన ఉండ్రాళ్ల ప్రశాంత్‌ను నియమించారు. ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, యూకే అధ్యక్షుడు సుమన్‌రావు బల్మూరి నియామకపత్రాన్ని అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూకే విభాగం ఆధ్వర్యంలో చేస్తున్న సేవ, సాంస్కృతిక కార్యక్రమాలకు యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. కూకట్‌పల్లికి చెందిన ప్రశాంత్ తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం లో పాల్గొన్నారని తెలిపారు. ప్రశాంత్ లాంటి ఉద్య మకారుడు యూకేలో విద్యార్థిగా ఉంటూ పలు జాగృ తి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ తన వంతు కృషి చేయటం వల్ల ఈ రోజు ఇన్‌చార్జి పదవీతో గౌరవించామన్నారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడు తూ.. నా సేవలను గుర్తించి బాధ్యతలు అందించినం దుకు జాగృతి అధ్యక్షురాలు కవిత, యూకే అధ్యక్షుడు సమన్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం



పెంటమ్మ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: మానసిక సమస్యను ఎదుర్కొంటున్న ఓ మహిళ ఇంటి నుంచి బయ టకు వెళ్లి తిరిగి ఇంటికి రాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి. గోపాల్ తన భార్య పెం టమ్మ(45)తో ఇంద్రనగర్‌లో నివాసం ఉంటు న్నాడు. గోపాల్ 24వ తేదీ ఉదయం 9గంటలకు ఆఫీసుకు వెళ్లి రాత్రి 8గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో భార్య ఆచూకీ కోసం పరిసరాల్లో వెతికాడు. దీంతో పరిసర ప్రాం తాలో వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. తన భార్య పెంటమ్మ మానసికంగా ఇబ్బందులు పడు తుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొ న్నాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీ సులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేష్‌చారి

మోతీనగర్: ఓ వ్యక్తి అదృశ్య మైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీపతి ఆంజ నేయులు, కుటుంబీకులు తెలి పిన వివరాల ప్రకారం... డివి జన్ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన కె. వెంకటే ష్చారి(31) ఈనెల 20న ఉదయం 11గంటలకు పనికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుం బీకులు స్నేహితులు, బంధువుల వాకబు చేసిన ఆచూకీ లభించలేదు. దీంతో వారు సోమవారం అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వకుంటే ఊరుకునేది లేదు

- సీఐటీయూ నేత రాజశేఖర్

బాలానగర్: బాలానగర్ మండలంలోని ప్రజా సం ఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బాలానగర్ మం డల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం లో పేదల సొంతింటి కల నెరవేరేదెప్పుడని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం దాటేస్తోందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకుంటే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

◆ బీసీ కులాలందరికీ రూ.లక్ష అందించాలన్నారు. స్థలం ఉన్న వారికి రూ.3లక్షలు కాకుండా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మరో రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పేదలను ఏకం చేసి పోరాడతామని హెచ్చరిం చారు. అనంతరం బాలానగర్ తహసీల్దార్ కృష్ణకు మెమొరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు జి. సుగుణ, మం డల సహాయ కార్యదర్శి రజియా బేగం, సుల్తానా బేగం, ప్రసాద్, వెంకటయ్య, రాజయ్య, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జూదరుల అరెస్టు

మోతీనగర్: పేకాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీపతి ఆంజనే యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో వివేకానం ద కమిటీహాల్‌లో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25,400 నగదు, 5సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిం దితులు పాపిరెడ్డినగర్ వాసులుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ప్రభుత్వాలు, పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదు'



కూకట్‌పల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్ పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కూక ట్‌పల్లి మండల కార్యాలయం వద్ద నాయకులు మం డల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకుడు ఎం. శంకర్, సీఐటీయూ కూకట్‌పల్లి మండల కార్య దర్శి కే. కృష్ణనాయక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు ఏ. రంగా రెడ్డి, లక్ష్మీపతిరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజేష్, మహిళా సంఘం కార్యదర్శి ప్రమీలలు పాల్గొని మాట్లాడారు.

◆ ఎన్ని ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, పేదల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. పేదల బతుకులు మార్చి వారిని ఆదు కుందాం అన్నది కూడా ఈ ప్రభుత్వాలకు లేదని వారు పేర్కొన్నారు. తెలంగాణ వస్తే ప్రజల బతు కులు మారుతాయని ఎన్నో ఆశలతో ఎదురుచూ సిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు.

◆ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 17 జిల్లాల్లో 61 కే ంద్రాల్లో లక్షలాది మంది పేదలు గుడిసెలు వేసుకొని కొన్ని నెలల నుంచి అక్కడే ఉం టున్నారని అన్నారు. వారికి పట్టాలు ఇవ్వకపోగా వారిపై పోలీసులు, రౌడీలతో దౌర్జన్యం చేయిస్తు న్నారని ఆరోపించారు. ప్రజలు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని కోరారు. వారికి అండగా ప్రజా సంఘాల నాయకుల ఉంటారని పేర్కొన్నారు.

◆ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని మండల కార్యా లయాల్లో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు బస్సు జాత నిర్వహిస్తున్నామన్నారు. డబుల్ బెడ్‌రూ మ్‌లు, గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షల ఇవ్వాల ని.. బీసీ రుణాలు లక్ష వెంటనే మంజూరు చేయాల ని.. వికలాంగ, గిరిజన, దళితబంధు వెంటనే అమలు చేయాలని.. పెన్షన్, రేషన్ కార్డులతో పాటు ఆదాయ సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు, రాములు, స్వామి, శ్రీనివాస్, రాజు, సాయిరెడ్డి, గంగారెడ్డి, లక్ష్మి, చిరంజీవి, రంజిత్, శ్రీను, నాగ మణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



దేవినగర్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని దేవినగర్‌లో రూ.25.60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పను లకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధు లతో కూకట్‌పల్లి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్ర మాలు పూర్తి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామ న్నారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్య నారాయణ, ఏఈ శివప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాంచందర్ రావు, మహిపాల్ రెడ్డి, నర్సింగ్‌రావు, వెంకటేశ్వర రావు, హరి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసంతోనే గెలుపు


క్యాప్రికాట్ టెక్నాలజీస్ ప్రొడక్ట్ మేనేజర్ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: ఏ రంగం లోనైనా విజయం సాధించా లంటే నిరంతర అభ్యాసం ముఖ్యమని, అప్పుడే కొత్త నైపుణ్యం, జ్ఞానం అలవడ తాయని క్యాప్రికాట్ టెక్నాల జీస్ ప్రొడక్ట్ మేనేజర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'మెషిన్ లెర్నింగ్– ఇట్స్ అప్లికేషన్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాల జీ'పై మూడు రోజులపాటు జరిగే అధ్యాపక వికాస కార్యక్రమం సోమవారంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. అం దుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం 6 నెలల్లో మారిపోతోందని, కొన్నిసార్లు పూర్తిగా కొత్తదనం సంతరించుకుంటోందన్నారు. ఐదేళ్లకోసారి కొత్త సాంకేతిక వస్తోందని, దానిని ఆది నుంచి నేర్చుకోక పోతే విద్యార్థుల ముందు నిలబడటం కష్టమవు తుందని అభిప్రాయపడ్డారు. రోబోటిక్ పరిజ్ఞానం తో రూపొందించిన టిక్–టాక్–టో గేమ్‌ను మం గళవారం కార్యక్రమంలో ప్రదర్శిస్తామన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, ఈఈ సీఈ విభాగా ధిపతి ప్రొఫెసర్ టి.మాధవి పాల్గొన్నారు.

'డ్రగ్ ఫ్రీ సొసైటీ' లక్ష్యంగా సాగాలి



కేంద్రీయ విద్యాలయలో ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే కార్యక్రమంలో విద్యార్థులు వేసిన పెయింటింగ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్

రాయదుర్గం: 'డ్రగ్ ఫ్రీ సొసైటీ' ఏర్పాటే లక్ష్యంగా సాగాలని కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సి పల్ జితేంద్రకుమార్ సూచించారు. డ్రగ్స్ విని యోగంతో ఎదురయ్యే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం కార్యక్ర మాన్ని నిర్వహించారు. 'ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే'తో గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం తో ఎదురయ్యే అనర్థాలపై పెయింటింగ్స్, స్లోగన్స్, డిబేట్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యా ర్థులు వేసిన పెయింటింగ్స్, స్లోగన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విద్యాలయ లైబ్రే రియన్ శివకృష్ణశాస్త్రి, పీజీటీ హిందీ అపర్ణా, ఇంగ్లిష్ పీజీటీ వందన మనహస్ పర్యవేక్షించారు.

మరో వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలి



జెడ్‌సీ మమతకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ తదితరులు

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో మరోక వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని సోమవారం కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ జెడ్‌సీ మమతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డు పరిపాలన కార్యా లయం మోతీనగర్‌లో ఏర్పాటు చేయడంతో మూసాపేట, మారుతినగర్, ముష్కిపేట్, జనతానగర్, వడ్డెర బస్తీ, ఇందిరానగర్, అంబే ద్కర్ నగర్, జిల్లా బస్తీ, ఇడబ్ల్యూయస్ భరత్‌నగర్, యాదవ బస్తీ, బాబూ గజ్జీవన్‌రామ్ బస్తీ, మహేశ్వరి నగర్, శక్తి నగర్‌లలో నివసించే వారికి దూరం అవుతుందన్నారు. ప్రజలు తమ సమ స్యలు తెలియజేయటానికి దూరభారం అవుతుం దని పేర్కొన్నారు. ముష్కిపేట్‌లో అందుబాటులో ఉన్న వార్డు కార్యాలయాన్ని ఈ కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా మూసాపేట డివి జన్‌కి మరొక నూతన పరిపాలన వార్డు కార్యా లయం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరా మన్నారు. మూసాపేట డివిజన్ మోతీనర్, మూసాపేట రెండు భాగాలు వేరుగా ఉండటం వల్ల అక్కడ వార్డు కార్యాలయం ఉన్నందున వారి సమస్యలు అక్కడున్న వార్డు కార్యాలయంలో తెలియజేస్తారన్నారు. మూసాపేటలోని ముష్కిపే ట్‌లో కూడా మరోక వార్డు పరిపాలనా వ్యవస్థని ఏర్పాటు చేసే విధంగా ప్రజల తరపున అభ్యర్థిస్తున్నాని తెలిపారు.